# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 22 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ప్రభుత్వ వైద్యాన్ని విశ్వసిస్తేనే సంపన్న దేశం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రజలు ప్రయివేటు ఆరోగ్య సంరక్షణను భరించగలిగితే ఆ దేశం ధనిక, సంపన్న దేశం కాబోదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలందరూ ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను విశ్వసించినప్పుడే ధనిక, సంపన్న దేశంగా పరిగణించగలమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన 17 నెలల్లో ప్రజల విశ్వసించిన అనేక సందర్భాల్లో వేములవాడ కూడా ఇలాంటి సందర్భాన్ని వెలుగులోకి తెచ్చిందని పేర్కొన్నారు. సివిల్ జడ్జి జ్యోతిర్మయి తన ప్రసవానికి ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాన్ని ఎంచుకుని ఒక ఉదాహరణగా నిలిచారని సీఎం పేర్కొన్నారు. ఈ ఎంపిక ఆమె రెండో బిడ్డకు కూడా ఒక గొప్ప అవకాశమని తెలిపారు. నూతన శిశువు తెలంగాణకు ఒక ఆశాకిరణమని సీఎం అభివర్ణించారు.

# పాక్‌కు బుద్ధి చెప్పడంలో కేంద్రం విఫలం

- ట్రంప్ చెబితే కాల్పులు విరమించడం దురదృష్టకరం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డివి చవకబారు విమర్శలు
- ఇందిరా, రాజీవ్‌లు దేశ ఐక్యతకు పాటుపడ్డారు
- రాజీవ్‌గాంధీ వర్ధంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పహల్గాం మారణకాండ తర్వాత పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాటాలకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం సువర్ణాకాశం చేజార్చుకుందని అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి సీఎం పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు.

ఇందిరా గాంధీ ప్రధాని ఉన్నప్పుడు దేశ పౌరులపై తీవ్రవాదులు దాడులకు తెగబడితే పాకిస్థాన్ తో యుద్ధం చేశారని, అమెరికాతో పాటు అగ్ర దేశాలు భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చాయని, ఎక్కడా కూడా ఇందిరా గాంధీ తలొగ్గలేదని గుర్తు చేశారు. యుద్ధం చేసి పాక్‌పై గెలిచిన ధీరశాలిగా దివంగత ప్రధాని ఇందిరా గాంధీ అని ప్రశంసించారు. పహల్గాం టెర్రర్ అటాక్ తరువాత దేశంలో తొలిసారి తిరంగా ర్యాలీ చేసింది తామేనని తెలిపారు. తాము ర్యాలీ చేసినప్పుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దుప్పటి కప్పుకుని పడుకున్నారా? అని చురకలంటించారు. రాజకీయాలను పక్కన పెట్టి ఆపరేషన్ సిందూర్ విషయంలో మోడీ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల తరపున తాము సంపూర్ణ మద్దతు ప్రకటించామన్నారు.

ప్రస్తుతం పహల్గాం ఘటనలో పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని విఫలమయ్యారని విమర్శించారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ చెబితేనే కాల్పుల విరమణ చేసే పరిస్థితికి భారత ప్రభుత్వ గ్రాఫ్ పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాద దాడులను సమర్థవంతంగా ఎదుర్కోలేని ప్రభుత్వం దేశాన్నీ, దేశ ప్రజలను ఎలా రక్షిస్తుందని ప్రశ్నించారు. ఈ వాస్తవాలను మరిచిన కొంతమంది చేవలేని వ్యక్తులు నేడు రాజీవ్‌గాంధీని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రానికి అండగా నిలబడాల్సిన సమయంలో బయటకు రాని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు బీజేపీ నేతలు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని సీఎం కొనియాడారు. సరళీకృత ఆర్థిక విధానాలతో ఆయన భారత్‌ను బలమైన దేశంగా నిలబెట్టారని గుర్తు చేశారు. 18 ఏండ్లకే ఓటు హక్కును కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో యువతకు భాగస్వామ్యం కల్పించారని అన్నారు. "సెక్రెటేరియట్ దగ్గర రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే కొందరు సంకుచిత మనస్తత్వంతో విమర్శలు చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది, కాంగ్రెస్ పార్టీది. దేశ రక్షణ కోసం భారత జవాన్లకు అండగా నిలబడతాం. అది మా బాధ్యత. దేశ సమగ్రత విషయంలో మేం రాజకీయాలు చేయం. దేశ భద్రతకు కట్టుబడి పనిచేస్తాం" అని సీఎం స్పష్టం చేశారు.

కశ్మీర్ ఘటనలపై పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ , మల్లికార్జున ఖర్గేతో పాటు అందరం కేంద్రానికి, పోరాటం చేస్తున్న వీర జవానులకు అండగా నిలబడ్డామని, ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలకు తావివ్వకుండా దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. దేశ సమగ్రతను కాపాడటంలో మహాత్మాగాంధీ , ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ , పీవీ నరసింహారావు విగ్రహాలతో ఈ ప్రాంతం భారతీయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చెప్పారు. దేశాభివృద్ధిలో స్వర్గీయ రాజీవ్ గాంధీ పాత్ర మరువలేనిదని కొనియాడారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన వారిలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీహెచ్ఎంసీ మేయర్, తదితరులు ఉన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

## 27 మంది మావోలు హతం!



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. నారాయణ్‌పూర్ జిల్లాలో చోటు చేసుకున్న భీకరమైన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు హతమైనట్టు తెలుస్తున్నది. వీరిలో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ కూడా ఉన్నారు. ఆయనపై రూ.1 కోటికి పైగా రివార్డు ఉన్నది. పలువురు కీలక నాయకులు కూడా ఉన్నట్టు సమాచారం. నంబాల మృతిని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ధ్రువీకరించటం గమనార్హం.

పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బసవరాజుతో పాటు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ), పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) లకు చెందిన సీనియర్ క్యాడర్ ఉన్నదన్న నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు అబూజ్‌మడ్ అడవుల్లో బుధవారం ఉదయం ఆపరేషన్‌ను ప్రారంభించాయి. మావోయిస్టులకు పట్టున్న ఈ అటవీ ప్రాంతంలో జరిగిన ఆపరేషన్‌లో నారాయణ్‌పూర్, బీజాపూర్, దంతేవాడ జిల్లాల నుంచి డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్(డీఆర్‌జీ) సిబ్బంది రంగంలోకి దిగింది. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య తీవ్రస్థాయిలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు చనిపోయారు. పలువురికి తీవ్ర గాయాలైనట్టు సమాచారం. మృతి చెందిన మావోయిస్టుల్లో నంబాల కేశవరావుతో పాటు మధు (దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మావోయిస్టు అగ్ర నాయకుడు), మావోయిస్టు ప్రచురణ జంగ్‌తో సంబంధమున్న నవీన్‌లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో ఒక జవాన్ మరణించారనీ, భద్రతా సిబ్బందిలో మరికొందరికి గాయాలయ్యాయని బస్తర్ రేంజ్ ఐజీ తెలిపారు. ఏకే-47, ఎస్ఎల్ఆర్, ఐఎన్ఎస్ఏఎస్, కార్బైన్‌తో పాటు ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు దంతేవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ చెప్పారు. పలువురు సీనియర్ మావోయిస్టులు మరణించటం లేదా తీవ్రంగా గాయపడినట్టు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం వద్ద నుంచి అందిన ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తున్నదని నారాయణ్‌పూర్ ఎస్పీ ప్రభాత్ కుమార్ వివరించారు. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టుల పోరాటంలో ఉన్నారు. ఆయన కోసం భద్రతా బలగాలు దేశవ్యాప్తంగా జల్లెడ పట్టాయి. చివరకు అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అంతమొందించాయి. ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందినట్లు ఎక్స్ వేదికగా అమిత్ షా వెల్లడించారు. "నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది" అని రాసుకొచ్చారు.

### స్పందించిన ప్రధాని మోడీ

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్రమోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను ప్రశంసించారు. "మీ అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా. మావోయిజం ముప్పును నిర్మూలించి.. ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ప్రధాని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పలుచోట్ల బుధవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతోపాటు పిడుగులు పడ్డాయి. దీంతో ముగ్గురు చనిపోయారు. మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసి ముద్దయింది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేక అకాల వర్షానికి ధాన్యం తడిసింది. తొర్రూర్ మండలం అమ్మాపురం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో జాప్యం, లారీల కొరత, మరోపక్క ఎప్పుడు వర్షం వస్తుందోనని భయంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కొనుగోళు కేంద్రాల వద్ద ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. ఒకేసారి వర్షం రావడంతో రైతులు పంటను కాపాడుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. మెదక్ జిల్లా శివ్వంపేటలో దాన్యం తడిసింది. దౌల్తాబాద్‌లో తడిసిన ధాన్యంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిజాంపేటలో వడ్లు తడిశాయి. నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. కల్లాల్లోనే ధాన్యం తడిసింది.

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురవగా.. మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వం హెచ్చ రికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మ్యాన్‌హోల్స్, కరెంట్ పోల్స్ విషయంలో జాగ్ర త్తగా ఉండాలని నగర వాసులను అప్రమత్తం చేశారు. ఎలాంటి పరిస్థి తులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఎస్‌డీఆర్ఎఫ్, ఆయా బృందాలను అధికారులు అప్రమత్తం చేశారు.

## కమీషన్ల దృష్టి మరల్చేందుకే

# కమిషన్ నోటీసుల డ్రామా

- ఎన్ని నోటీసులు ఇచ్చినా దూది పింజలే..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వారి అవినీతి కమీషన్ల నుంచి దృష్టి మరల్చేందుకే కమిషన్ నోటీసుల డ్రామా ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆం మండిపడ్డారు. 17 నెలలుగా పాలన చేతకాక, ఇచ్చిన దొంగ హామీలను ఎలా అమలు చేయాలో తెలియక, తమ కమీషన్ల అవినీతి నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే కాళేశ్వరం కమిషన్‌తో కేసీఆర్‌కు నోటీసులు ఇప్పించారని అన్నారు.

కాంగ్రెస్ చెప్పుకున్న ప్రజాపాలన కాస్త పర్సంటేజీల పాలనగా మారిందని విమర్శించారు. తమ అవినీతి కమీషన్ల నుంచి దృష్టి మరల్చేందుకే కమిషన్ నోటీసుల డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు నల్గొండకు వెళ్లిన కేటీఆర్.. అక్కడ మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో 20 నుంచి 30 శాతం కమీషన్లు, పర్సంటేజీలు ఇవ్వకపోతే ఏ పని జరగదని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలే బహిరంగంగా చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి చాంబర్ ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేసిన ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతికి పరాకాష్ట అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన 17 నెలల కాలంలోనే పాలన చేతగాక ప్రజలకు ఇచ్చిన అడ్డగోలు హామీలను నెరవేర్చే దమ్ము లేక కాంగ్రెస్ ప్రభుత్వం చతికిలపడిందని విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్టును ఒక విఫల ప్రయోగంగా చూపించే బీజేపీ, కాంగ్రెస్ కుట్రలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు వచ్చాయని మండిపడ్డారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా అవన్నీ దూదిపింజల్లా

మిగితా 2వ పేజీలో

## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- 4.13 లక్షల మంది దరఖాస్తు
- 892 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గురువారం నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 29 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ఇంటర్ పరీక్షల నియంత్రణ అధికారి (సీవోఈ) జయప్రదబాయి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు 2,36,915 మంది అబ్బాయిలు, 1,76,681 మంది అమ్మాయిలు, ఇతరులు ఒకరు చొప్పున మొత్తం 4,13,597 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఇందులో ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగం నుంచి 2,49,204 మంది, ఒకేషనల్ నుంచి 17,003 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం నుంచి 1,34,988 మంది, ఒకేషనల్ నుంచి 12,402 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. వారి కోసం 892 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. గురువారం నుంచి జరిగే ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని వివరించారు. 30 నిమిషాల ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు అనుమతి ఉంటుందని తెలిపారు. హాల్‌టికెట్‌ను తప్పనిసరిగా తేవాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్ నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మొబైల్‌ఫోన్లు, గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తేవడం నిషేధమని తెలిపారు.

# వక్ఫ్ ఇస్లాంలో ముఖ్యమైన భాగం కాదు

- సుప్రీంకోర్టుకు కేంద్రం వివరణ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వక్ఫ్ అనేది దాతృత్వం తప్ప మరొకటి కాదని, అది ఇస్లాంలో ముఖ్యమైన భాగం కాదని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. వక్ఫ్ బోర్డులు లౌకిక విధులను మాత్రమే నిర్వహిస్తాయని చెప్పింది. వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం విచారణ చేపట్టగా, కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. "వక్ఫ్ అనేది ఇస్లామిక్ భావన. కానీ అది ఇస్లాంలో ముఖ్యమైన భాగం కాదు. వక్ఫ్ అనేది దాతృత్వం తప్ప మరొకటి కాదు. దానధర్మాలు ప్రతి మతంలో భాగం. హిందువులకు దానధర్మాలు అనే వ్యవస్థ ఉంది. సిక్కులు కూడా దానిని కలిగి ఉన్నారు. ప్రభుత్వ భూమిపై ఎవరికీ హక్కు లేదు. ప్రభుత్వానికి చెందిన ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటిస్తే ప్రభుత్వం ఆ ఆస్తిని కాపాడుకోగలదని సుప్రీంకోర్టు తీర్పు చెబుతోంది" అని తుషార్ మెహతా వ్యాఖ్యానించారు.

ఉపశమన ఉత్తర్వులకు సంబంధించి ముందుగా నిర్ణయించిన మూడు అంశాలకే పరిమితమై విచారణ జరగాలని మరోసారి సుప్రీంను మెహతా కోరారు. బ్రిటిష్, వరుస భారత ప్రభుత్వాలు పరిష్కరించలేని సమస్యలను తాజా వక్ఫ్ చట్ట సవరణలు పరిష్కరించాయని తెలిపారు. "1923 నుంచి ఉన్న ముప్పును మేం నిర్మూలిస్తున్నాం. ప్రతి వాటాదారుడి వాదనలు విన్నాం. కొంతమంది పిటిషనర్లు మొత్తం ముస్లిం సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకోలేరు. మాకు 96 లక్షల ప్రాతినిధ్యాలు వచ్చాయి. జేపీసీ 36 సమావేశాలు నిర్వహించింది" అని సొలిసిటర్ జనరల్ చెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం-2025పై మధ్యంతర ఉపశమన ఉత్తర్వులు జారీ చేయాలంటే అందుకు బలమైన కారణాలను చూపాలని సుప్రీంకోర్టు మంగళవారం

మిగితా 2వ పేజీలో

# విచారణకు హాజరవుతా

- ఎంపీ ఈటల రాజేందర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కమిషన్ నుంచి వచ్చే నోటీసులకు భయపడబోనని, కేసీఆర్ హయాంలో జరిగిన విషయాలను అవసరమైతే వెల్లడిస్తానని ఆయన తెలిపారు. తనకు ఇంకా కమిషన్ నుంచి అధికారికంగా ఎలాంటి నోటీసులు అందలేదని, ఒకవేళ వస్తే పార్టీ అనుమతి తీసుకుని తప్పకుండా స్పందిస్తానని తెలిపారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు, వాటి పర్యవసానాల గురించి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరినవారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో తనతో పాటు మంత్రులుగా పనిచేసిన తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కడియం శ్రీహరి వంటి నేతలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని, వారికి అప్పటి పరిస్థితులు తెలియవా అని ఈటల ప్రశ్నించారు. తాను ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఆ శాఖ కార్యదర్శిగా పనిచేసిన రామకృష్ణారావే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్‌తో విభేదించడానికి అందరూ జంకుతున్న రోజుల్లోనే తాను ఆరు నెలల పాటు ఎలా పోరాటం చేశానో తెలంగాణ సమాజం మొత్తం చూసిందని, కాబట్టి ఇలాంటి నోటీసులకు తాను భయపడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు.

కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన ఒక మంత్రివర్గ ఉపసంఘంలో తాను, తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి సభ్యులుగా ఉన్నామని, ఆ కమిటీ కొనసాగుతుండగానే తెరవెనుక ఏం జరిగిందో త్వరలోనే మీడియాకు వెల్లడిస్తానని అన్నారు.

మిగితా 2వ పేజీలో

# వర్షాలు కురుస్తున్నాయి.. అప్రమత్తంగా ఉండండి

- ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించండి
- ధాన్యం తడవకుండా చూడండి
- వర్షాలపై సీఎస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

వివరాలు 2వ పేజీలో

# సోనియా, రాహుల్‌పై ఈడీ ఆరోపణలు

## ఢిల్లీ ప్రత్యేక కోర్టులో వాదనలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపణలు చేసింది. నేషనల్ హెరాల్డ్ ఆస్తుల ద్వారా వారు రూ.142 కోట్లు లబ్ది పొందారని ఆరోపించింది. ఈ మేరకు బుధవారం ఢిల్లీ ప్రత్యేక కోర్టులో ఈడీ తన వాదనలు వినిపించింది. ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వి రాజు వాదనలు వినిపించారు. నవంబర్ 2023లో నేషనల్ హెరాల్డ్‌తో ముడిపడి ఉన్న రూ.751.9 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసే వరకూ ఆ నేరం ద్వారా వచ్చిన ఆదాయాన్ని సోనియా, రాహుల్ అనుభవించారని కోర్టుకు తెలిపారు. నేషనల్



హెరాల్డ్ పేపర్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీని ఈడీ గతంలో విచారించింది. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను నడిపారన్న ఫిర్యాదు మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేపట్టాయి. అయితే, సీబీఐ విచారణ అర్ధాంతరంగానే

మిగితా 2వ పేజీలో

# 30 రోజులలోగా ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి



**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, ఎల్లారెడ్డి పేట**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను లబ్దిదారులు 30 రోజులు లోగా ప్రారంభించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లబ్దిదారులకు సూచించారు.బుధవారం ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని లక్ష్మీ మల్లారెడ్డి ఫంక్షన్ హాల్లో రెండో విడత కింద 643 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు కేకే మహేందర్ రెడ్డి తో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలంలో రెండో విడత కింద 643 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి నేడు ఉత్తర్వులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని అన్నారు.

ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటి చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని సూచించారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని , నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాలలో అందుబాటులో పెడతామని, మండలంలో ఉన్న 23 గ్రామాలకు ఇసుక రీచ్ లను అలాట్ చేశామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని అన్నారు.

30 రోజుల లోగా నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించాలని లేని పక్షంలో మంజూరు చేసిన ఇండ్లు రద్దు అయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ సొంత స్థలంలో మంచి ఇండ్లు నిర్మించుకొని ప్రజల సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ సవేరా బేగం, ఫ్యాక్స్ చైర్మెన్ కృష్ణ రెడ్డి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో సత్తయ్య, తాసిల్దార్ సుజాత,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సినీ థియేటర్ల మూసివేత నిర్ణయం వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1వ తేదీ నుంచి థియేటర్లను మూసివేయాలని ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయం ప్రస్తుతానికి వాయిదా పడింది. ఈ విషయమై మంగళవారం తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యాలయంలో ఉదయం నుంచి నిర్మాతలు, పంపిణీదారులతో జరిగిన వేర్వేరు సమావేశాల్లో సుదీర్ఘ చర్చల అనంతరం ఈ మేరకు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. థియేటర్లను నడుపుతూనే ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించుకోవాలని మెజారిటీ సభ్యులు అభిప్రాయపడినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే ఉదయం 11 గంటలకు తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రతినిధులు తెలుగు రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్లతో సమావేశమయ్యారు. డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలలో అత్యధిక శాతం మంది సభ్యులు థియేటర్ల సమ్మెకు సుముఖత చూపలేదని, ప్రదర్శనలు కొనసాగిస్తూనే సమస్యలను పరిష్కరించుకునే దిశగా కృషి చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. గతంలో క్యూబ్ సమస్యలపై కొన్ని రోజుల పాటు థియేటర్లు మూసివేయడం, అలాగే నటీనటుల పారితోషికాల విషయంలో కొన్ని రోజుల పాటు షూటింగులు నిలిపివేయడం వంటివి జరిగాయని, అయితే ఆ రెండు సందర్భాల్లోనూ ఆశించిన స్థాయిలో సత్ఫలితాలు రాలేదని పలువురు సభ్యులు గుర్తుచేశారు. ఈ అనుభవాల దృష్ట్యా, ఈసారి థియేటర్లు మూతపడకుండా, సినిమాలు ప్రదర్శిస్తూనే సమస్యలకు సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనాలని వారు సూచించారు. మే 30 నుంచి పలు సినిమాలు వరుసగా విడుదల కానున్నాయని, ఇలాంటి కీలక సమయంలో థియేటర్లు మూసివేస్తే పరిశ్రమకు మరింత నష్టం వాటిల్లుతుందని వారు పేర్కొన్నారు. కాబట్టి, థియేటర్ల మూసివేత కార్యక్రమాన్ని పునరాలోచించుకుని, తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధికి సహకరించే విధంగా తోడ్పడాలని ఎగ్జిబిటర్లకు వారు విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో జూన్ 1 నుంచి జరగాల్సిన థియేటర్ల బంద్ ప్రస్తుతానికి ఆగిపోయినట్లేనని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు పెను ప్రమాదం తప్పింది. వాతావరణ శాఖ అధికారుల సూచన మేరకు కోదాడలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. అయితే, మంత్రి ఉత్తమ్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ హుజూర్ నగర్ మండలం మేళ్ల చెరువులో ల్యాండ్ కావాల్సి ఉండగా.. మబ్బులు కమ్ముకోవడం, గాలివాన నేపథ్యంలో పైలట్ అప్రమత్తమయ్యారు. దీంతో, అత్యవసరంగా కోదాడలో ల్యాండ్ చేశారు. అనంతరం, మంత్రి ఉత్తమ్ కుమార్.. కోదాడ నుంచి హుజూర్ నగర్‌కు రోడ్డు మార్గంలో వెళ్లిపోయారు

## ఒకే రోజు 9,990 బిల్లులు క్లియర్

**బలగం టీవీ, హైదరాబాద్**

: పంచాయతీలకు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.153 కోట్లను విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల్లోని 9,990 బిల్లులు ఒకే రోజు క్లియర్ చేసింది. ఈ క్రమంలో రూ.10 లక్షల లోపు బిల్లులను చెల్లించింది. గతేడాది ఆగస్టు వరకు పెండింగులో ఉన్న బిల్లులకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇచ్చింది. ఈ పెండింగ్ బిల్లుల కోసమే మాజీ సర్పంచ్‌లు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధి, ఎస్‌డీఎఫ్ కింద చేపట్టిన పనుల కోసం రూ.85 కోట్లలను ప్రభుత్వం విడుదల చేసింది.

## కన్నడ రచయిత్రి బాను ముస్తాక్‌కు బుకర్ ప్రైజ్

**బలగం టీవీ, హైదరాబాద్**




కన్నడ రచయిత్రి, సామాజికవేత్త , న్యాయవాది బాను ముస్తాక్ ఈ ఏటి 2025 ప్రతిష్టాత్మక బుకర్ ప్రైజ్ గెల్చుకున్నారు. ఆమె రచించిన చిన్నకథల సంకలనం 'హార్ట్‌లాంప్' ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ గెలుచుకుంది. ఈ బహుమతి గెలుచుకున్న తొలి కన్నడ పుస్తకంగా నిలిచింది. టేట్ మోడరన్‌లో బహుమతిని మంగళవారం అందుకున్నారు. కుటుంబం, సమాజ ఉద్రిక్తతలను "చమత్కారమైన, స్పష్టమైన, వ్యావహారిక, హృదయాన్ని కదిలించే, ఉత్తేజపరిచే" రూపంలో రాసిన ముస్తాక్ శైలి న్యాయనిర్ణేతలను ఆకర్షించింది. ఈ పుస్తకాన్ని ఆంగ్లంలోకి అనువదించిన రచయిత దీపా భస్తితో కలిసి ఈ బహు మతిని అందుకున్నారు. బాను ముస్తాక్ 1990 నుంచి 2023 మధ్య రాసిన 12 హృదయ విదారక కథలు ఆమె జన్మస్థలమైన కర్ణాటకలోని ముస్లిం మహిళల కష్టాలను చిత్రీకరిస్తాయి. మహిళల హక్కులను సమర్థించడం, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా ఆమె పోరాటానికి, ముఖ్యంగా ముస్లిం మహిళలు ఎదుర్కొంటున్న పోరాటానికి ప్రతీకగా ముష్తాక్ ఉన్నారు. బహుమతి ప్రదాన సభలో ఆమె మాట్లాడుతూ "ఏ కథ కూడా చిన్నది కాదనే నమ్మకం నుండి ఈ పుస్తకం పుట్టింది, మానవ అనుభవాల వస్త్రంలో ప్రతి దారం మొత్తం బరువును కలిగి ఉంటుంది" అని ముస్తాక్ అన్నారు. "మనల్ని తరచుగా విభజించడానికి ప్రయత్నించే ప్రపంచంలో, సాహిత్యం మనం ఒకరి మనస్సులలో ఒకరు జీవించగలిగే చివరి పవిత్ర ప్రదేశాలలో ఒకటిగా మిగిలిపోయింది, కొన్ని పేజీలు మాత్రమే" అని పేర్కొన్నారు. తన అందమైన భాషకు ఇది ఎంత అందమైన విజయం అని దీపా భస్తీ పేర్కొన్నారు. బహుమతిగా 50 వేల పౌండ్లు రచయిత, అనువాదకులకు లభించింది.

## నంబాల కేశవరావు ఎవరంటే..?

**బలగం టీవీ, హైదరాబాద్**

మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మృతితో ఎన్‌కౌంటర్ దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా లు కూడా ఈ ఎన్‌కౌంటర్ గురించి స్పందించారు. ఈయనది ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా జియ్యన్నపేట గ్రామం. 1955లో ఆయన జన్మిం చారు. ఈయన తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెల్లు ఉన్నారు. వరంగల్‌లోని అత్యంత ప్రతిష్టాత్మక మైన రీజినల్ ఇంజినీరింగ్ కాలేజ్ (ఆర్ఈసీ)లో ఇంజినీరింగ్ చదివాడు. 1980లో విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చాడు. వరంగల్‌లో చదువుతున్న రోజుల్లోనే రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)తో సంబంధం కలిగి ఉన్నాడు. అదే ఏడాది ఒక విద్యార్థి ఉద్యమ నిరసనల్లో అరెస్టయ్యాడు. 1984లో ఎంటెక్ చదువుతున్న పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్ధాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. ఆ తర్వాత నాలుగు దశాబ్దాలుగా పలు బాధ్యతలు చేపట్టి కీలక నాయకుడిగా ఎదిగాడు. నంబాల కేశవరావు ప్రస్తుతం నిషేధిత సీపీఐ(మావోయిస్టు) ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. మిలటరీ వ్యూహాల రూపకల్పన అమలు, ఆయుధాల వ్యాపారులతో సత్సంబంధాలు నెర్పడం ఆయన ప్రత్యేకతలు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఆయనపై వందల కేసులు ఉన్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల్లో కొన్ని అత్యంత ప్రధానమైన మావోయిస్టు దాడుల వెనక ఈయన కీలక వ్యూహకర్తగా ఉన్నారని సమాచారం. ఇందులో 76 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయిన 2010 దంతేవాడ ఘటన, 2013లో ఛత్తీస్‌గఢ్‌లోని ఝీరామ్ ఘాటీలో కాంగ్రెస్ నాయకులను లక్ష్యంగా చేసుకున్న సంచలన ఘటనలు ఉన్నాయి. ఈయనపై రూ.1.5 కోట్ల రివార్డు ఉన్నది. సీపీఐ(మావోయిస్టు) సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) కమాండర్-ఇన్-చీఫ్‌గా పని చేశారు. దాడులు, వ్యూహాత్మక ఆపరేషన్లు, సుదీర్ఘ మిలిటరీ వ్యూహాలు పర్యవేక్షించేవాడు. మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న దండకారణ్య అటవీ డివిజన్‌కు ఆయన నేతృత్వం కూడా వహించారు. భద్రతా ఏజెన్సీల వద్ద కేశవరావుకు సంబంధించి పరిమిత సమాచారం మాత్రమే ఉండేది. ఈయనకు సంబంధించిన తాజా ఫోటోలు కానీ, వివరాలు కానీ లేకపోవటం గమనార్హం. ఎన్ఐఏ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర పోలీసులు ఆయన కోసం గాలిస్తున్న తరుణంలో ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు.

## జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- **ఎస్డీఆర్ఎఫ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆ**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలోకి నైరుతీ రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశిస్తున్నందున, అకాల, భారీ వర్షాల పట్ల జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ (ఎస్డీఆర్ఎఫ్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆయా జిల్లాల కలెక్టర్లను హెచ్చరించారు. ఈనెలాఖరులోగానే రుతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందనీ, వాటివల్ల ఎలాంటి విపత్తులు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు మార్గదర్శకాలను విడుదల చేశారు. గత ఏడాది ఆగస్టులో వచ్చిన భారీ వర్షాలతో సకాలంలో ఎన్డీఆర్ఎఫ్ దళాలు చేరుకోక పోవడంతో తీవ్ర నష్టం జరిగిందనీ, ఆ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి 12 స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్ (ఎస్ఆర్డీఎఫ్)లను సిద్ధంగా ఉంచామన్నారు. ఒక్కో టీమ్‌లో తెలంగాణా స్పెషల్ పోలీస్‌కు చెందిన వందమంది సుశిక్షితులైన పోలీసులు ఉంటారనీ, ఈ బృందాలను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉంచామన్నారు. ఎక్కడైనా భారీ వర్షాలు, తుఫానులు వస్తే, కలెక్టర్ల ఆదేశాలతో ఈ బృందాలు అక్కడకు చేరుకొని సహాయ, పునరావాస చర్యలు చేపడతాయన్నారు. వీటికి అదనంగా హైదరాబాద్‌లో మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ఫైర్ స్టేషన్ల సిబ్బందికి ప్రత్యేకంగా విపత్తుల నివారణ చర్యలపై శిక్షణను ఇచ్చామన్నారు. హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో తక్షణం స్పందించేలా హైడ్రా బృందాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. కలెక్టర్లు ఈ బృందాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలాగే విపత్తుల నివారణలో సుశిక్షితులైన సింగరేణి కాలరీస్ సిబ్బంది సేవలను కూడా ఉపయోగించుకునేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. రాష్ట్రంలో ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు జరిగినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విపత్తుల నిర్వహణ శాఖ సంసిద్ధంగా ఉన్నదని ఆయన స్పష్టం చేశారు.

## పాకిస్థాన్‌లో స్కూల్ బస్సుపై ఆత్మాహుతి దాడి

- **ఆరుగురి మృతి**

**బలగం టీవీ, హైదరాబాద్**



పాకిస్థాన్ లోని కల్లోలిత బలూచిస్థాన్ కుజ్‌దార్ ప్రావిన్స్‌లో బుధవారం ఓ స్కూల్ బస్సుపై ఆత్మాహుతి దాడి జరిగింది. ముగ్గురు పిల్లలతో సహా మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. 38 మంది గాయపడ్డారు. ఆర్మీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సులో పిల్లలను తీసుకెళ్తున్న సమయంలో ఈ దాడి జరిగిందని స్థానిక అధికారి యాసిర్ ఇక్బాల్ దస్తి వెల్లడించారు. ఈ దాడిలో ఓ కారును ఆత్మాహుతి కోసం వాడినట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు ఏ గ్రూపు ఈ దాడికి బాధ్యత వహించలేదు. బలూచిస్థాన్ వేర్పాటు వాదులు దీని వెనుక ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ సంఘటన జరిగిన వెంటనే లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ అధికారి ఆ ప్రదేశానికి వెళ్లారు. దర్యాప్తు కోసం అక్కడ ఆధారాలను సేకరిస్తున్నారు. మృతదేహాలను, క్షతగాత్రులను కంబైన్డ్ మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని క్వెట్టా, కరాచీ లోని ఆస్పత్రికి చేర్చారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. అమాయకులైన పసివాళ్లు వారి ఉపాధ్యాయులు బలికావడంపై తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. భారత్ మద్దతు కలిగిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దోషులను పట్టుకుని చట్టానికి అప్పగించాలని అధికారులను ఆదేశించారు. అధ్యక్షుడు అసిఫ్ అలి జర్దారీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. విదేశాంగ మంత్రి మొహిసిన్ నక్వీ పిల్లలపై దాడి చేసిన వారు మానవ మృగాలని తీవ్రంగా విమర్శించారు. ప్రావిన్సియల్ చీఫ్ మినిస్టర్ సర్ఫరాజ్ బుగ్తి ప్రావిన్స్ లోని ప్రతి ఉగ్రవాదిని పట్టుకుని పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. ఖైబర్ ఫక్తుంఖ్వా చీఫ్ మినిస్టర్ అలి అమిన్ గండపూర్ ఈ దాడిని ఖండించారు.

# ముంబై ప్లే ఆఫ్స్‌కు.. ఢిల్లీ ఇంటికి..



- ఢిల్లీ క్యాపిటల్స్ పై ముంబై విజయం
- 59 పరుగుల తేడాతో గెలుపు
- ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన ముంబై

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ సీజన్ 2025లో ముంబై ఇండియన్స్ టీమ్ ప్లేఆఫ్‌కు అర్హత సాధించింది. బుధవారం జరిగిన కీలక మ్యాచ్‌లో ముంబై 59 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది

టాస్ ఓడిపోయి తొలుత బ్యాటింగ్ కు దిగింది ముంబై. నిర్ణీత 20 ఓవర్లల్లో అయిదు వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్. తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. 43 బంతుల్లో నాలుగు భారీ సిక్సర్లు, ఏడు బుల్లెట్ల వంటి ఫోర్లతో 73 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. రోహిత్ శర్మ విఫలం అయ్యాడు. అయిదు పరుగులే చేసి అవుట్ అయ్యాడు. ముస్తాఫిజుర్ రెహ్మాన్ బౌలింగ్ లో వికెట్ కీపర్ అభిషేక్ పొరెల్ కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఓపెనర్ రియాన్ రికెల్టన్– 25, టాప్ ఆర్డర్ బ్యాటర్ విల్ జాక్స్– 21, తిలక్ వర్మ– 27, కేప్టెన్ హార్దిక్ పాండ్యా– 3 పరుగులు చేశారు. చివర్లో నమన్ ధీర్ 8 బంతులను ఎదుర్కొని 24 పరుగులు సాధించాడు.

అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 18.2 ఓవర్లలో 121 పరుగులకు కుప్పకూలింది. సమీర్ రిజ్వీ(35 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 39), విప్రజ్ నిగమ్(11 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 20) టాప్ స్కోరర్లుగా నిలిచారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ముంబై బౌలర్లలో మిచెల్ సాంట్నర్(3/11), జస్‌ప్రీత్ బుమ్రా(3/12) మూడేసి వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించారు. ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, విల్ జాక్స్, కర్ణ్ శర్మ తలో వికెట్ తీసారు.

ఢిల్లీ ఇన్నింగ్ లో ఏ ఒక్క బ్యాటర్ కూడా చెప్పుకోదగ్గ స్కోర్ చేయలేదు. 39 పరుగులు చేసిన సమీర్ రిజ్వీ ఒక్కడే టాప్ స్కోరర్. కేఎల్ రాహుల్ సహా అందరూ విఫలం అయ్యారు.





కేఎల్ రాహుల్– 11, ఫాఫ్ డుప్లెసిస్– 6, అబి . షేక్ పోరెల్– 5, విప్రజ్ నిగమ్– 20, ట్రిస్టన్ స్టబ్స్– 2, అశుతోష్ శర్మ– 18, మాధవ్ తివ ారీ– 3, దుష్మంత చమీరా – 8 (నాటౌట్), కుల్ దీప్ యాదవ్– 7, ముస్తాఫిజుర్ డకౌట్ అయ్యారు.

## ‘ఎక్స్ ట్రా’ టైమ్‌పై ముందే ఆలోచించొచ్చు కదా

- ఇప్పుడు కేకేఆర్‌కు అన్యాయం జరిగింది
- ప్లే ఆఫ్స్ అవకాశం కోల్పోయాం
- ఐపీఎల్ సీఓఓ హేమంగ్ అమిన్‌కు కోల్‌కతా సీఈవో వెంకీ మెయిల్

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్లే ఆఫ్స్ నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లకు అదనపు గంట సమయం కేటాయించిన విషయం తెలిసిందే. వర్ష సూచన ఉన్నందున కీలకమైన మ్యాచ్‌లు రద్దు కాకూడదనే ఉద్దేశంతో బీసీసీఐ ఈ కొత్త నిబంధన తీసుకొచ్చింది. అయితే.. ఈ నియమంపై కోల్‌కతా నైట్ రైడర్స్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ‘ఐపీఎల్ పునరుద్ధరణతోనే అదనపు గంట సమయం ప్రస్తావని ఎందుకు తీసుకురాలేదు? .. మేము ప్లే ఆఫ్స్ అవకాశం కోల్పోయాం’ అని తమకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించాడు కోల్‌కతా సీఈవో వెంకీ ఐపీఎల్ సీఓఓ హేమంగ్ అమిన్ కి ఈమెయిల్ పంపాడు.

‘సీజన్ మధ్యలో నిబంధనలు మార్చడం ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అనివారం కావచ్చు. కానీ, ఇలాంటి మార్పులు తీసుకోనేటప్పుడు స్థిరత్వం ఉండాలి’ అని వెంకీ పేర్కొన్నాడు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలతో వాయిదా పడిన ఐపీఎల్ మే 17 నుంచి మొదలైంది. చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ, కోల్‌కతా మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా టాస్ పడకుండానే రద్దయ్యింది. కనీసం 5 ఓవర్ల ఆట కూడా సాధ్యపడదని తేల్చడంతో.. కోల్‌కతా ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించింది. ఇదే విషయాన్ని తన ఈమెయిల్‌లో వెంకీ ప్రస్తావించాడు.

‘ఐపీఎల్ పునరుద్ధరణ తర్వాత మే 17న తొలి మ్యాచ్. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న ఆర్సీబీ, కోల్‌కతా ఇరుజట్లకు అది చాలా కీలకమైన గేమ్. మే 15న భారీ వర్షం కారణంగా చిన్నస్వామి స్టేడియం ఈతకొలనును తలపించింది. మే 17న మ్యాచ్ సమయానికి వర్షం పడుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది కూడా. అయినా సరే.. బీసీసీఐ.. ఐపీఎల్ సీఓఓలు మౌనంగా ఉన్నారు. అనుకున్నట్టే వాన కారణంగా మ్యాచ్ రద్దయ్యింది. ఒకవేళ అప్పుడే మీరు అదనపు గంట సమయం ఉంటుందని చెప్పి ఉంటే కనీసం 5 ఓవర్ల ఆట అయినా సాధ్యపడేది. ఇప్పుడేమో మే 20 నుంచి ఎక్స్ ట్రా టైమ్ వర్తిస్తుందని చెబుతున్నారు. అదేదే ముందే ఆలోచించి ఉంటే బాగుండు.. మేము నష్టపోయేవాళ్లం కాదు’ అని కోల్‌కతా సీఈఓ వెంకీ అన్నారు.





## మలేషియా మాస్టర్స్‌లో భారత షట్లర్లు ముందంజ

- రెండో రౌండ్‌కు హెచ్‌ఎస్ ప్రణయ్ , కిడాంబి శ్రీకాంత్, కరుణాకరన్
- తొలి రౌండ్‌లోనే ఇంటి దారి పట్టిన పీవీ సింధు

**బలగం టీవీ, హైదరాబాద్**

: మలేషియా మాస్టర్స్‌లో భారత స్టార్ షట్లర్లు అదరగొట్టారు. ఫేవరెట్లు హెచ్‌ఎస్ ప్రణయ్ , కిడాంబి శ్రీకాంత్, కరుణాకరన్‌లు ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో సత్తా చాటారు. ఈ ముగ్గురు రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. అయితే.. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు మొదటి రౌండ్‌లోనే నిరాశపరుస్తూ ఇంటిదారి పట్టింది.

కౌలాలంపూర్ వేదికగా జరుగుతున్న మలేషియా మాస్టర్స్‌లో ప్రణయ్ అదరగొట్టాడు. జపాన్‌కు చెందిన ఐదో సీడ్ కెంటా నిషిమొటోను చిత్తు చేశాడు. గంట 22 నిమిషాల పాటు సాగిన పోరులో భారత స్టార్ 21–17, 21–16తో గెలుపొందాడు. రెండో రౌండ్‌లో ప్రణయ్‌కు జపాన్ షట్లర్ యుషి తనక ఎదురువ్వనున్నాడు. ఇక మూడో సీడ్ చౌ థియెన్ చెన్‌తో జరిగిన మ్యాచ్‌లో కరుణాకరన్ అద్భుతంగా ఆడాడు. చైనీస్ తైపీ ఆటగాడైన చౌపై 21–13, 21–14తో టోర్నీలో శుభారంభం చేశాడు. తర్వాతి రౌండ్‌లో క్రిస్టో పొపోవ్(ఫ్రాన్స్)ను కరుణాకరన్ ఢీ కొట్టనున్నాడు.

కిడాంబి శ్రీకాంత్ సైతం తనకంటే ఎక్కువ ర్యాంకర్ అయిన లూ గాంజ్ జూ(చైనా)ను చిత్తుగా ఓడించాడు. 57 నిమిషాల పోరులో శ్రీకాంత్ తొలి సెట్ గెలిచి జూపై పైచేయి సాధించాడు. అయితే.. ఆ తర్వాత పుంజుకున్న చైనీస్ షట్లర్ రెండో సెట్ గెలవగా. మూడో సెట్ కీలకమైంది. ఈ సెట్లో చెలరేగిన శ్రీకాంత్ 21–11తో గెలుపొంది రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. ఈ సీజన్‌లో పెద్దగా ఫామ్ లేని సింధు.. మలేషియా ఓపెన్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. కానీ బుధవారం జరిగిన మ్యాచ్‌లో వియత్నాం షట్లర్ గుయెన్ థుయ్ లిన్హ్ ధాటికి భారత స్టార్ చేతులెత్తేసింది. రెండో సెట్ గెలుపొందినప్పటికీ.. 11–21, 21–14, 15–21తో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీష క్రాస్టో ద్వయం రెండో రౌండ్‌లో అడుగు పెట్టింది.

## హరిహరవీరమల్లు నుంచి లిరికల్ వీడియో

**బలగం టీవీ, హైదరాబాద్**

పవన్ కల్యాణ్ నటిస్తున్న చిత్రం హరిహరవీరమల్లు. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతుంది. హరిహరవీరమల్లు పార్ట్–1 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ థర్డ్ సింగిల్ అసుర హననం లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. . ఒక యోధుడు పైకి వస్తాడు. ఒక వారసత్వం ప్రారంభమవుతుంది. ధర్మం కోసం యుద్ధం ప్రారంభం కానుంది.. అంటూ విడుదల చేసిన ఈ పాట గూస్‌బంప్స్ తెప్పిస్తున్నది.పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. బాలీవుడ్ యాక్టర్, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని ఏఎం రత్నం సమర్పణలో మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మిస్తున్నారు.




## విజయ్ ఆంటోని కొత్త చిత్రం ‘లాయర్’


**బలగం టీవీ, హైదరాబాద్**

విజయ్ ఆంటోని తన 26వ చిత్రం ‘లాయర్’తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ‘జెంటిల్ ఉమెన్’ ఫేమ్ రైటర్ జాషువా సేతురామన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గ్రిప్పింగ్ కోర్ట్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మాణంలో, మీరా విజయ్ ఆంటోని సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ప్రీ–ప్రొడక్షన్ పనులు ఇప్పటికే మొదలైన ఈ సినిమా రెగ్యులర్ షఉటింగ్ జూన్ 2025 నుంచి ప్రారంభం కానుంది. నటీనటులు, సాంకేతిక బృందం, ఇతర వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రం తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

## ‘కన్నప్ప’ నుంచి స్పెషల్ గ్లింప్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

మంచు విష్ణు పాన్ ఇండియా మూవీ ‘కన్నప్ప’ కు సంబంధించి మేకర్ మరో అప్ డేట్ విడుదల చేశారు. కన్నప్పలో మోహన్ లాల్ కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మోహన్ లాల్ బర్త్ డే సందర్భంగా కన్నప్ప నుంచి స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ వీడియోలో మోహన్ లాల్ స్క్రీన్ ప్రెజెన్స్, కనిపించిన తీరు అద్భుతంగా ఉంది. ఈ చిత్రంతో మోహన్ లాల్ మళ్లీ ఆడియెన్స్‌పై తనదైన ముద్ర వేసేలా కనిపిస్తున్నారు.




‘కన్నప్ప’ లో దైవిక శక్తితో ముడిపడి ఉన్న కిరాత అనే పాత్రను మోహన్‌లాల్ పోషించారు. ఈ పాత్రలో మోహన్‌లాల్ ప్రెజెన్స్, యాక్టింగ్ అందరినీ ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతుంది.

## ఛత్రపతి శివాజీగా రితేష్ దేశ్‌ముఖ్

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడిగా బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన రితేష్ దేశ్‌ముఖ్ ఇప్పుడు దర్శకుడిగా మారి తన డ్రీమ్ ప్రాజెక్ట్ ‘రాజా శివాజీ’తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమా 2026 మే 1న, అంటే మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. రితేష్ దేశ్‌ముఖ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు, స్వయంగా ఛత్రపతి శివాజీ పాత్రను పోషిస్తున్నారు. ‘రాజా శివాజీ’ చిత్రం మరాఠీ, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళంతో సహా ఆరు భాషల్లో రిలీజ్ కానుంది.

